క్లుప్తంగా

ఎన్‌సీసీ యూనిట్ ప్రారంభం



విద్యార్థులకు సూచనలిస్తున్న కమాండర్లు

కదిరి అర్బన్: స్థానిక ఎస్టీఎస్ఎన్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బుధవారం కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ స్మిత ఆధ్వర్యంలో ఎన్‌సీసీ యూనిట్ ప్రారంభించారు. కార్యక్రమానికి జిల్లా కేంద్రం నుంచి కమాండర్లు హవల్దార్ బ్రిజేష్‌కుమార్ శర్మ, సుబేదార్ కౌసలేంద్రసింగ్ హాజరయ్యారు. ఈ సందర్భంగా విద్యార్థులకు పరుగుపందెం, భౌతిక పరీక్షలు నిర్వహించారు. బాలురు 13 మంది, బాలికలు 5 మందిని ఎంపిక చేశారు. కార్యక్రమంలో పీడీ నరసింహాచారి, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ క్రిష్టా నాయక్, వైస్ ప్రిన్సిపాల్ శివప్రసాద్, పలువురు అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పంట నమోదు తప్పనిసరి



పంట నమోదును పరిశీలిస్తున్న డీఏఓ

ధర్మవరం రూరల్: ఖరీఫ్‌లో సాగు చేసిన పంటలను రైతులు తప్పని సరిగా ఈ పంట నమోదు చేయించుకోవాలని జిల్లా వ్యవసాయాధికారి సుబ్బారావు రైతులకు సూచించారు. బుధవారం ఆయన గొట్లూరు, మల్కాపురం గ్రామాలలో ఈ పంట నమోదు కార్యక్రమాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా రైతు భరోసా సిబ్బంది నమోదు చేసిన పంట యొక్క వివరాలు, పంట రకము, విస్తీర్ణం, తదితర వివరాలను పరిశీలించారు. పంట నమోదు కార్యక్రమం ఈ నెలాఖరు వరకు ఉంటుందన్నారు. పంట నమోదు చేసుకున్న రైతులందరు ఈకేవైసీ చేయించుకోవాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో వ్యవసాయాధికారి ముస్తఫా, రైతు భరోసా సిబ్బంది చరిత్, కమ్మన్న, రైతులు తదితరులు పాల్గొన్నారు.

రైతు ఆత్మహత్య



మృతుడు వేణుగోపాల్

గాండ్లపెంట: మండల పరిధిలోని గొడ్డువెలగల పంచాయతీ నరసప్పగారి పల్లికి చెందిన రైతు గొడ్డువెలగల వేణుగోపాల్ (60) అప్పుల బాధ తాళలేక ఆత్మహత్య చేసుకున్నట్లు పోలీసులు బుధవారం తెలిపారు. వివరాలిలా ఉన్నాయి.. మృతుడికి 7 ఎకరాల పొలం ఉండగా పంటలు పెట్టి నష్టపోయాడు. ప్రైవేటు వ్యక్తుల వద్ద రూ.6 నుంచి రూ.8 లక్షల వరకు అప్పులు చేశాడు. ఇద్దరు కుమారుల పెళ్లిళ్లకు అప్పు చేసి తీర్చలేక మంగళవారం సాయంత్రం పొలం వద్దకు వెళ్లి కందిపంటకు తెచ్చుకున్న పురుగుల మందు తాగాడు. ఇంటికి చేరుకుని అపస్మారక స్థితిలో పడి ఉండగా భార్య గంగులమ్మ గమనించి వెంటనే కదిరి ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ప్రాథమిక చికిత్స అనంతరం అనంతపురం జిల్లా ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందాడు. భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ మల్లికార్జునరెడ్డి తెలిపారు.

వైఎస్సార్ బీమా తక్షణ సాయం అందజేత



నగదు అందజేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

నల్లచెరువు: తలమర్లవాండ్లపల్లి పంచాయతీ పరిధిలోని గొల్లపల్లికి చెందిన నీలకంఠ (35) ఈ నెల 21వ తేదీన అనారోగ్యంతో మృతి చెందాడు. బుధవారం వైఎస్సార్ బీమా తక్షణ సాయం కింద రూ.10 వేల నగదును మృతుని భార్య పి.శాంతమ్మకు మార్కెట్‌యార్డు వైస్ చైర్మన్ నాగభూషణ, వైఎస్సార్‌సీపీ నాయకులు కల్లిపల్లి శ్రీనివాసులు అందజేశారు. పంచాయతీ కార్యదర్శి రమణప్పనాయుడు, వెల్ఫేర్ అసిస్టెంట్ హనుమంతు వలంటీర్ అమరావతి తదితరులు పాల్గొన్నారు.

బీసీ హాస్టల్ తనిఖీ

నల్లచెరువు: మండల కేంద్రం పూలకుంట రోడ్డులోని బీసీ బాలుర వసతి గృహాన్ని తహసీల్దార్ రవికుమార్ బుధవారం ఆకస్మికంగా తనిఖీ నిర్వహించారు. హాస్టల్లోని పలు రికార్డులను పరిశీలించారు. రోజు వారి మెనూ ప్రకారం ఆహారం అందిస్తున్నారా అని విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. హాస్టల్లోని వంటగది, పరిసర ప్రాంతాలను పరిశీలించారు. పిల్లలకు వడ్డించే ఆహారం నాణ్యతను పరిశీలించారు. విద్యార్థుల వసతుల పట్ల ఆయన సంతృప్తి వ్యక్తం చేశారు. కార్యక్రమంలో వార్డెన్ లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

30న కౌన్సిల్ సమావేశం

ధర్మవరం: పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో ఈనెల 30న కౌన్సిల్ సమావేశం నిర్వహించనున్నామని చైర్‌పర్సన్ కాచర్ల లక్ష్మీ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 11గంటలకు జరిగే కౌన్సిల్ సమావేశానికి కౌన్సిలర్లు, మున్సిపల్ అధికారులు హాజరు కావాలని సూచించారు.

కన్యకా పరమేశ్వరీ.. పాహిమాం

- వైభవంగా అమ్మవారి విగ్రహ ప్రతిష్టాపనోత్సవం
- గ్రామోత్సవంలో మహిళల సందడి



ప్రత్యేక అలంకరణలో కన్యకా పరమేశ్వరి

కదిరి టౌన్: పట్టణంలో వాసవీ కన్యకా పరమేశ్వరి దేవి వెండి విగ్రహ ప్రతిష్టాపనోత్సవం బుధవారం అంగరంగ వైభవంగా జరిగింది. ఆలయంలో ఉదయం నుంచి అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. రకరకాల పూలతో అలంకరించి అర్చనలు చేపట్టారు. సాయంత్రం అమ్మవారిని తిరువీధుల్లో గ్రామోత్సవం నిర్వహించారు. రథోత్సవంలో ఆర్యవైశ్య సంఘం మహిళలు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. కోలాటాలు ఆకట్టుకున్నాయి. తిరువీధుల్లో అమ్మవారిని దర్శించుకుని భక్తులు మొక్కులు తీర్చుకున్నారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం నాయకులు, మహిళా సంఘం నాయకురాళ్లు పాల్గొన్నారు.



రథంలో అమ్మవారి గ్రామోత్సవం



కోలాటం ఆడుతున్న మహిళలు

రాష్ట్రస్థాయి క్రీడా పోటీలకు ఎంపిక



ఎంపికైన విద్యార్థులతో ఉపాధ్యాయులు

ధర్మవరం: రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలకు తమ క్రీడాకారులు ఎంపికయ్యారని శ్రీసాయికృప జూనియర్ కళాశాల నిర్వాహకులు తెలిపారు. స్థానిక కళాశాలలో బుధవారం విద్యార్థులను అభినందించారు. అనంతపురం పట్టణ ఇండోర్ స్టేడియంలో అండర్-19 కబడ్డీ రాష్ట్రస్థాయి పోటీలలో ప్రతిభ చూపి తమ కళాశాల విద్యార్థులు అయేషా, మేజబి, జయశ్రీలు ఎంపికయ్యారన్నారు. రాష్ట్రస్థాయిలో కూడా రాణించాలని ఆకాంక్షించారు.

రాష్ట్ర స్థాయి హాకీ పోటీలకు..

ధర్మవరం రూరల్: గొట్లూరు ఉన్నత పాఠశాల నుంచి రాష్ట్ర స్థాయి హాకీ జట్టుకు అండర్-17 విభాగంలో లక్ష్మీ, రవితేజ, అండర్-14 విభాగంలో విజయ్‌కుమార్, తేజశ్రీ, దుర్గలు ఎంపికయ్యారని ప్రధానోపాధ్యాయులు జగన్నాథం, ఫిజికల్ డైరెక్టర్ రఘునాథరావులు తెలిపారు. ఎంపికైన విద్యార్థులను బుధవారం ఉపాధ్యాయులు అభినందించారు. ఇటీవల అనంతపురంలోని ఆర్ట్స్ కళాశాల మైదానంలో పోటీల్లో ప్రతిభ కనబరచడంతో ఎంపిక చేశారన్నారు.

అసాంఘిక శక్తుల ఆటకట్టిస్తా

- పట్టణ సీఐ నారాయణరెడ్డి



కదిరి: అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తప్పవని కదిరి పట్టణ సీఐ డి.వి.నారాయణరెడ్డి హెచ్చరించారు. బుధవారం ఆయన కొత్తగా ఇక్కడ సీఐగా బాధ్యతలు చేపట్టారు. పలువురు ఎస్ఐలు, పోలీస్ సిబ్బంది ఆయనను మర్యాదపూర్వకంగా కలిసి బొకేలు, పండ్లు అందజేశారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. తాను నంద్యాల జిల్లా కోవెలకుంట్ల నుంచి బదిలీపై ఇక్కడికి వచ్చానన్నారు. గతంలో ఉమ్మడి అనంతపురం జిల్లాలో పలు ప్రాంతాల్లో ఎస్ఐగా, సీఐగా పనిచేశానని చెప్పారు. కదిరి పట్టణంలో ప్రధానంగా ఉన్న సమస్యలపై వారం పాటు అధ్యయనం చేసి యాక్షన్‌లోకి దిగుతానని తెలిపారు. శాంతిభద్రతల విషయంలో ఎంతటి వారైనా వదిలే ప్రసక్తే లేదన్నారు. యువత పెడత్రోవ పట్టకుండా చదువుపై దృష్టి సారించాలని ఆయన సూచించారు.

దాణా నాణ్యత పరిశీలన

ధర్మవరం రూరల్: ధర్మవరం పట్టణంలోని అంజనాశక్తి పశువుల దాణ కేంద్రంలోని దాణా నాణ్యతను పశువర్థక శాఖ ఏడీ (అడిషనల్ డైరెక్టర్) వీరభద్రయ్య ఆధ్వర్యంలో బుధవారం పరిశీలించారు. నమూనాలను సేకరించారు. అన్ని కంపెనీలకు సంబంధించి శాంపిల్స్ సేకరించారు. పరిశీలన కోసం ప్రభుత్వ పరిశోధనశాలకు పంపనున్నట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

50 మందికి వైద్య పరీక్షలు

పుట్టపర్తి అర్బన్: ఆయుష్మాన్ భవ కార్యక్రమంలో భాగంగా బుధవారం పుట్టపర్తి ప్రాథమిక పాఠశాలలో ఉచిత మెడికల్ క్యాంప్ ఏర్పాటు చేశారు. ప్రజలకు వైద్య సేవలు అందించారు. మెడికల్ ఆఫీసర్ క్రిష్ణయ్య ఆధ్వర్యంలో క్యాంప్ ఏర్పాటు చేసి 50 మందికి పైగా వైద్య పరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. ఇందులో ఉచిత ఎక్స్‌రే, టెలీ కన్సల్టేషన్, బీపీ, షుగర్ పరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. కార్యక్రమంలో ఎంఈఓ ప్రసాద్, హెచ్ఎం రజనీకాంత్ రెడ్డి, పీవీరమణారెడ్డి, నాగభూషణ, రాజగోపాల్, సుధారాణి, రాధారాణి, కృష్ణమ్మ, అపర్ణ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుడి సస్పెన్షన్

కదిరి అర్బన్: నాడు నేడు పనుల్లో అవినీతికి పాల్పడినట్లు నిర్ధారణ కావడంతో మండల పరిధిలోని దిగువపల్లి ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయుడు ముబారక్ అలీని డీఈఓ మీనాక్షి బుధవారం సస్పెండ్ చేసినట్లు మండల విద్యాధికారి చెన్నకృష్ణ తెలిపారు. ఈ మేరకు ఉత్తర్వులను జారీ చేసినట్లు ఆయన పేర్కొన్నారు. నాడు నేడు ఫేస్ -2 కింద పాఠశాలకు మంజూరైన రూ.2,12,290 నిధుల్లో అవినీతికి పాల్పడ్డాడని తెలిపారు.

ఇద్దరిపై కేసు నమోదు

తలుపుల: మండలంలోని సోమాలవాండ్లపల్లికి చెందిన సుధాకర్, ఇతని కుమారుడు గణేష్‌లు, సూర్యనారాయణ, వీరి భార్య శాంతమ్మలు విద్యుత్‌మోటారు నీటిలో మునిగి పోతుండగా పైకి లాగడం విషయంలో బుధవారం ఘర్షణ పడ్డారు. సుధాకర్, గణేష్‌కు గాయాలయ్యాయి. సూర్యనారాయణ, అతని భార్యపై ఎస్ఐ మగ్బుల్‌బాషా ఆదేశాల మేరకు కేసు నమోదు చేసినట్లు హెడ్ కానిస్టేబుల్ గురప్ప తెలిపారు.

ఉరుసు ప్రారంభం

పుట్టపర్తి టౌన్: పుట్టపర్తి మున్సిపాలిటీ పరిధి 17వ వార్డు బీడుపల్లి గ్రామంలో మిలాద్ ఉన్ నబీని పురస్కరించుకుని ఉరుసు ఉత్సవం ప్రారంభమైంది. రెండు రోజుల పాటు హిందూ, ముస్లింలు ఐక్యతగా ఉత్సవం జరుపుకోనున్నారు. ఈ సందర్భంగా నబీస్వామి దర్గాను రంగురంగుల పూలతో అలంకరించారు. బుధవారం సాయంత్రం 6 గంటలకు దేశ్‌ముఖి ఇంటి నుంచి గంధం ఊరేగింపుగా, స్వామి గుడిలో చదివింపులు చేసి భక్తులకు పంచిపెట్టారు. గ్రామస్తులు స్వామిని దర్శించుకొన్నారు. గురువారం దీపారాధన ఉంటుంది. ఆదివారం రాత్రి మతపెద్దలు ఖురాన్ సారాంశం వినిపిస్తారు.

ఘనంగా విగ్రహ ప్రాణ ప్రతిష్ట

ధర్మవరం రూరల్: మండల పరిధిలోని తిప్పేపల్లి గ్రామంలో బుధవారం పెద్దమ్మ అమ్మవారి విగ్రహ ప్రాణ ప్రతిష్ట కార్యక్రమాన్ని వేద పండితుల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. తిరుమల తిరుపతి దేవస్థానం, శ్రీవాణీ ట్రస్టు, సమరసత సేవా సంస్థల ఆధ్వర్యంలో నూతనంగా ఆలయం నిర్మించారు. ఈ సందర్భంగా భక్తులకు అన్నదానం చేశారు.

ముఖ్యమంత్రికి కృతజ్ఞతలు

కదిరి అర్బన్: కాంట్రాక్ట్ అధ్యాపకులు, ఉద్యోగులను రెగ్యులరైజ్ చేస్తూ అసెంబ్లీలో బిల్లు పాస్ చేసిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి ఏపీ కాంట్రాక్ట్ అధ్యాపకుల జేఏసీ నాయకులు బుధవారం ఓ ప్రకటనలో కృతజ్ఞతలు తెలిపారు. 23 ఏళ్ల బానిస బతుకుల నుంచి తమకు ముఖ్యమంత్రి విముక్తి కల్పించారని పేర్కొన్నారు. పాదయాత్రలో తమ కష్టాలు విని చూసి వెలుగులు నింపారని పేర్కొన్నారు. కార్యక్రమంలో కాంట్రాక్ట్ అధ్యాపకులు ఉమాదేవి, కౌసర్, దీపిక, సుజాత, వరప్రసాద్, ఆంజనేయులు, హరిత, రాజేంద్రప్రసాద్ తదితరులు ఉన్నారు.

ఇంటింటికీ స్వచ్ఛ నీరు



ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

బత్తలపల్లి: గ్రామీణ ప్రాంతాల్లోని ప్రతి ఇంటికీ స్వచ్ఛమైన తాగునీరు అందిస్తామని ఆర్‌డబ్ల్యూఎస్ ఇంజనీర్ వరలక్ష్మీ పేర్కొన్నారు. బుధవారం మండలంలోని సంజీవపురం గ్రామంలో జలజీవన్ మిషన్ పథకంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామీణ నీటి సరఫరా, పారిశుధ్య కమిటీ ఏర్పాటు చేయుట, నీటి నాణ్యత, వృథా నీటిని అరికట్టడం తదితర అంశాలపై మాట్లాడారు. ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ వరలక్ష్మీ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ జిల్లా అధికార ప్రతినిధి గుర్రం శ్రీనివాసరెడ్డి, రైతు విభాగం రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కమతం ఈశ్వరయ్య, జిల్లా మేనేజర్ నాగాంజనరెడ్డి, ఐఎస్ఏ కోఆర్డినేటర్ నరేష్‌కుమార్, ధనుంజయ, కార్యదర్శి నారాయణ, గ్రామ సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

క్రీడలతో ఉజ్వల భవిత



చెస్ ఆడుతున్న విద్యార్థులు



కబడ్డీ పోటీలో తలపడుతున్న బాలికలు

ధర్మవరం అర్బన్: క్రీడలతోనే ఉజ్వల భవిత ఉందని ప్రతి విద్యార్థి చదువుతోపాటు క్రీడల్లో రాణించాలని కళాజ్యోతి అధ్యక్షుడు నారాయణ, స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ కార్యదర్శులు సుగుణమ్మ, అంజన్న తెలిపారు. స్థానిక కళాజ్యోతిలో బుధవారం స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో అండర్-14, అండర్-17 చెస్ పోటీలను నిర్వహించారు. చెస్ పోటీలను ముఖ్య అతిథులు ప్రారంభించారు. అనంతరం వారు మాట్లాడుతూ చదరంగంతో మేధాశక్తి మెరుగుపడుతుందన్నారు. ప్రతి ఒక్క విద్యార్థి క్రీడల పట్ల మక్కువ చూపించాలని తెలిపారు. క్రీడాకారులకు దాత శిరీష భోజన వసతి కల్పించగా శీబా రామలింగయ్య క్రీడాకారులకు ట్రోఫీలను, డాక్టర్ సూర్యనారాయణరెడ్డి, నరేంద్రరెడ్డి, శింగనమల రామకృష్ణ వసతులు కల్పించడం హర్షణీయమని కొనియాడారు. చెస్ పోటీల్లో 262 మంది పోటీపడి ప్రతిభను చాటారు. కార్యక్రమంలో కళాజ్యోతి కార్యదర్శి రామకృష్ణ, డైరెక్టర్ శింగనమల రామకృష్ణ, ఆర్బిటర్లు శివకృష్ణ, మల్లికార్జున, ఆదిరత్నం, హుసేన్, టోర్నమెంట్ నిర్వాహకులు గోవిందు, మెహరాజ్, కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా క్రీడాపోటీలు

నల్లచెరువు: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ పాఠశాలలో బుధవారం క్రీడాపోటీలు ఉత్సాహంగా సాగాయి. ఎస్‌జీఎఫ్ ఆధ్వర్యంలో విద్యార్థులకు నియోజకవర్గ స్థాయి (బాలికల) అండర్-14, అండర్-17 విభాగాల్లో పోటీలు నిర్వహించారు. అండర్-14 విభాగంలో వాలీబాల్, త్రో బాల్, కబడీ, టెన్నిస్, బ్యాడ్మింటన్ పోటీలలో కదిరి జట్లు విజయం సాధించాయి. కోకో, బాల్ బ్యాడ్మింటన్‌లలో గాండ్లపెంట, ఎన్పీ కుంట జట్లు గెలుపొందాయి. అండర్-17 విభాగంలో వాలీబాల్, కబడ్డీ, టెన్నికాయిట్, బ్యాడ్మింటన్లలో కదిరి జట్ల విద్యార్థులు విజయం సాధించారు. బాల్ బ్యాడ్మింటన్, త్రోబాల్‌లో తలుపుల, కోకో-గాండ్లపెంట విద్యార్థులు విజయం సాధించారు. ప్రతిభ చూపిన విద్యార్థులను జిల్లా స్థాయి పోటీలకు ఎంపిక చేయనున్నట్లు కోఆర్డినేటర్ వి. షఫి తెలిపారు.

ఖాతాదారులకు మెరుగైన సేవలు

పుట్టపర్తి టౌన్: ఖాతాదారులకు మెరుగైన సేవలు అందించడమే లక్ష్యంగా ఆంధ్రప్రగతి బ్యాంక్ పనిచేస్తున్నట్లు బ్యాంకు రీజనల్ మేనేజర్ రవీంద్రారెడ్డి తెలిపారు. బుధవారం పుట్టపర్తి పట్టణంలో డిపాజిట్ల సేకరణ మహోత్సవ కార్యక్రమం నిర్వహించారు. బ్యాంక్ వద్ద నుంచి మున్సిపల్ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించి పథకాల గురించి విస్తృతంగా ప్రచారం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ డిపాజిట్ల వడ్డీ రేట్లు పెంచామన్నారు. మహిళల కోసం ప్రత్యేక పథకాలు తీసుకొచ్చామన్నారు. సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో మేనేజర్ సత్యనారాయణ గౌడ్, సిబ్బంది పాల్గొన్నారు.

ఆధార్ అనుసంధానం చేయించండి

తాడిమర్రి: మండలంలోని ఉపాధి హామీ కూలీల బ్యాంకు పొదుపు ఖాతాలకు తప్పనిసరిగా ఆధార్ కార్డును అనుసంధానం చేయించాలని ఏపీఓ సంజీవరెడ్డి క్షేత్ర సహాయకులను ఆదేశించారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో బుధవారం ఆయన ఉపాధి హామీ సిబ్బంది సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వర్షాలు ఆశాజనకంగా కురుస్తున్నందున ఉపాధి హామీ ద్వారా పండ్లతోటల సాగు చేపట్టిన రైతులను అప్రమత్తం చేయాలన్నారు. చీనీ, మామిడి తదితర మొక్కలు సాగు చేసిన రైతులు సరైన సమయంలో సస్య రక్షణ చర్యలు చేపట్టేలా చూడాలన్నారు. బిల్లులను వెంటనే అందించడానికి ప్రత్యేక కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో ఈసీ అశోక్ కుమార్‌రెడ్డి, క్షేత్ర సాంకేతిక సహాయకులు, కంప్యూటర్ ఆపరేటర్లు పాల్గొన్నారు.

ప్లాస్టిక్ విక్రయదారులకు జరిమానా

ధర్మవరం: ప్లాస్టిక్‌ను విక్రయిస్తే కఠిన చర్యలు తప్పవని మున్సిపల్ కమిషనర్ బండి శేషన్న తెలిపారు. పట్టణంలో బుధవారం సెరికల్చర్ కార్యాలయం సమీపంలోని దుకాణాలపై దాడులు నిర్వహించి రూ.5 వేలు జరిమానా విధించారు. పట్టణంలో ప్లాస్టిక్ విక్రయిస్తే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రజలు, వ్యాపారస్తులు సహకరించాలని సూచించారు. దాడుల్లో శానిటరీ ఇన్‌స్పెక్టర్లు మహబూబ్‌బాషా, శ్యామ్సన్ తదితరులు పాల్గొన్నారు.

పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలి

గాండ్లపెంట: మండల పరిధిలోని కురుమామిడి పంచాయతీ రెక్కమాను గ్రామ సచివాలయంలో బుధవారం స్వచ్ఛతాహి సేవా కార్యక్రమాన్ని సచివాలయ సిబ్బంది నిర్వహించారు. ఎంపీడీఓ రామానాయక్ పాల్గొని కార్యాలయాల పరిసరాలు నిత్యం పరిశుభ్రంగా ఉంచుకోవాలని సిబ్బందికి సూచించారు. అదే విధంగా కార్యాలయం చుట్టూ ఉన్న పిచ్చిమొక్కలు తొలగింపచేశారు. కార్యక్రమంలో గ్రామ సచివాలయ సిబ్బంది, పారిశుధ్య కార్మికులు పాల్గొన్నారు.

3న స్పాట్ అడ్మిషన్లు

కదిరి అర్బన్: స్థానిక ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో ఎలక్ట్రికల్, ఆటోమొబైల్ బ్రాంచ్‌లలో మిగిలిన సీట్లకు అక్టోబర్ 3న స్పాట్ అడ్మిషన్లు నిర్వహిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ నారాయణ బుధవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. 10వ తరగతి పాసైన విద్యార్థులు వినియోగించుకోవాలని ఆయన కోరారు. మరిన్ని వివరాలకు 9010222175, 9491781677 సెల్ నంబర్లకు సంప్రదించాలని సూచించారు.

మూడో విడత అడ్మిషన్లు ప్రారంభం

కదిరి అర్బన్: స్థానిక ఎస్టీఎస్ఎన్ ప్రభుత్వ డిగ్రీ, పీజీ కళాశాలలో 2023-24 విద్యాసంవత్సరానికి ఈ నెల 27నుంచి 29వ తేదీ వరకు మూడవ విడత అడ్మిషన్లు నిర్వహిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ స్మిత బుధవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. బీఏ (హెచ్ఈపీ, టీహెచ్‌పీ), బీకామ్ (జనరల్, కంప్యూటర్స్), బీఎస్సీ (ఎంపీసీ,బీజడ్‌సీ,సీజడ్ఎస్,పారామెడికల్) గ్రూపులు ఉన్నాయని తెలిపారు.

విత్తన కిట్లు సద్వినియోగం చేసుకోండి



విత్తన కిట్లను అందజేస్తున్న ప్రజాప్రతినిధులు

పుట్టపర్తి అర్బన్: ప్రకృతి వ్యవసాయంతో మరింత లబ్ధి చేకూర్చడానికి ప్రభుత్వం ఉచితంగా అందజేసిన విత్తన కిట్లు ఎస్సీ రైతులు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా అగ్రీ అడ్వయిజరీ బోర్డు చైర్మన్ అవుటాల రమణారెడ్డి పేర్కొన్నారు. బుధవారం పుట్టపర్తి ఎంపీడీఓ కార్యాలయంలో పుట్టపర్తి, బుక్కపట్నం, కొత్తచెరువు మండలాలకు చెందిన 166 మంది ఎస్సీ రైతులకు 100 శాతం సబ్సిడీపై విత్తన కిట్లు పంపిణీ చేశారు. ఒక్కో కిట్ విలువ సుమారు రూ.10 వేలు ఉంటుందన్నారు. ఒక్కో కిట్‌లో కందులు, పెసలు, వేరుశనగ, రాగులు, కొర్రలు, సజ్జలు, మొక్కజొన్న, జొన్న, శనగలతో పాటు కిచెన్ గార్డెన్ కూరగాయల కిట్లు రెండు ప్యాకెట్లు ఉంటాయన్నారు. వీటితో పాటు ప్రతి రైతుకూ 100 లీటర్ల డ్రమ్ములు రెండు, 200 లీటర్ల డ్రమ్ము ఒకటి, టార్పాలిన్ ఒకటి, పసుపు జిగట అట్టలు 30, లింగాకర్షక బుట్టలు 8 అందజేశారు. వీటిని ఎస్సీ కార్పొరేషన్ ద్వారా అందజేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో పుట్టపర్తి ఎంపీపీ ఏవీ రమణారెడ్డి, బుక్కపట్నం ఎంపీపీ శ్రీధర్‌రెడ్డి, పుట్టపర్తి, కొత్తచెరువు మండల వైఎస్సార్ సీపీ కన్వీనర్‌లు నరసారెడ్డి, జగన్‌మోహన్ రెడ్డి, అగ్రీ బోర్డు మండల చైర్మన్‌లు సూర్యనారాయణరెడ్డి, వెంకట్‌చౌదరి, సొసైటీ అధ్యక్షుడు రుషికేశవ రెడ్డి, యువనాయకులు గోవర్ధన్‌రెడ్డి, సర్పంచ్ కుల్లాయిరెడ్డి, ఎస్సీ కార్పొరేషన్ సిబ్బంది హాజరయ్యారు.

అర్హులందరికీ సంక్షేమ ఫలాలు



నరసంపల్లిలో ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ పథకాల గురించి వివరిస్తున్న ప్రజాప్రతినిధులు, అధికారులు

కనగానపల్లి: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలోనే తారతమ్య బేధాలు లేకుండా అందరికీ సంక్షేమ పథకాలు అందుతున్నాయని ఎంపీపీ కుంపట్టి భాగ్యమ్మ, జెడ్పీటీసీ సభ్యుడు మారుతీప్రసాద్ తెలిపారు. మండలంలోని నరసంపల్లిలో బుధవారం మండల స్థాయి ప్రజాప్రతినిధులు, అధికారులు పర్యటించారు. ఈ సందర్భంగా ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాల గురించి ఇంటింటికీ వెళ్లి ప్రజలకు తెలియజేశారు. నరసంపల్లిలో సచివాలయ భవన నిర్మాణంతో ఇతర ప్రభుత్వ భవనాల నిర్మాణాలను త్వరగా పూర్తి చేయించటంతో పాటు పేదలకు ఇళ్ల పట్టాలను కూడా మంజూరు చేయిస్తామన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ రమాదేవి, హౌసింగ్ ఏఈ చిరంజీవి, ఏపీఓ వెంకటేష్‌నాయక్, స్థానిక ఎంపీటీసీ దాదాఖలందర్, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ అమరనాథరెడ్డి, డైరెక్టర్ ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు వ్యాసరచన పోటీలు



పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు

బత్తలపల్లి: భగవాన్ శ్రీసత్యసాయి బాబా దివ్య అనుగ్రహ ఆశీస్సులతో మానవతా విలువలపై విద్యార్థులకు వ్యాసరచన పోటీలను నిర్వహించారు. బుధవారం స్థానిక శ్రీజ్యోతి హైస్కూల్‌లో శ్రీసత్యసాయి రాష్ట్రస్థాయి వ్యాసరచన పోటీల్లో 8, 9, 10వ తరగతి విద్యార్థులు పాల్గొన్నారు. విద్యార్థులకు, తల్లిదండ్రులకు అవగాహన పెంపొందించడానికి నిర్వహించినట్లు ప్రధానోపాధ్యాయులు మిడతల లక్ష్మీనారాయణ వివరించారు. కార్యక్రమంలో నెట్టెం నాయుడు, కల్పన, ఉపాధ్యాయులు నాగపెద్దిరాజు, కాటమయ్య, రమేష్, ఆదెప్ప, శంకరయ్య, వెంకటపతి, రాజశేఖర్, మూర్తి తదితరులు పాల్గొన్నారు.

బైకు బోల్తా.. యువకుడి మృతి

కదిరి టౌన్: బైకు బోల్తా పడడంతో గాయాలపాలై యువకుడు మృతి చెందాడు. వాల్మీకి పాఠశాల వైపు నుంచి ద్విచక్రవాహనంలో కుటాగుళ్లకు చెందిన ఇద్దరు యువకులు బుధవారం కదిరికి వస్తుండగా పర్వీన్ బాను పెట్రోల్ బంక్ వద్ద ఘటన చోటుచేసుకుంది. అశ్వక్ (14), సోహేల్‌కు గాయాలయ్యాయి. స్థానికులు ఇద్దరినీ కదిరి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి, చికిత్సలు నిర్వహించారు. అశ్వక్ పరిస్థితి విషంగా ఉండటంతో మెరుగైన వైద్యం కోసం అనంతపురం తరలించగా, చికిత్స ఫలించక ప్రాణాలు విడిచాడు.

చిన్నారులకు టీకాలు శ్రీరామరక్ష

తాడిమర్రి: ప్రభుత్వం చిన్నారులకు ఉచితంగా అందించే వ్యాధి నిరోధక టీకాలు శ్రీరామ రక్ష అని పీహెచ్ఎన్ లక్ష్మీదేవి పేర్కొన్నారు. మండలంలోని 10 గ్రామ సచివాలయాల్లోని సబ్ సెంటర్‌లలో బుధవారం వైద్య సిబ్బంది చిన్నారులకు డీపీటీ, టీటీ, పెంటా, ఎమ్మెమ్మార్, నిమోనియా తదితర టీకాలను వేశారు. తాడిమర్రి ఆరోగ్య ఉపకేంద్రంలో వైద్య సిబ్బంది నిర్వహించిన కార్యక్రమాన్ని ఆమె పరిశీలించారు. కార్యక్రమంలో ఏఎన్ఎం కోమలి, ఆశా వర్కర్లు నరసమ్మ, ధనమ్మ, లక్ష్మీనారాయణమ్మ తదితరులు పాల్గొన్నారు.